06ATP27_06ATP27.qxd 04-07-2024 PM 10:02 Page 1



# పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం కార్మికురాలి ఆత్మహత్యా యత్నం..!

- అధికార పార్టీ నాయకులు దాడిచేసి కొట్టినందుకేనని సీఐటీయూ ఆగ్రహం - గుంతకల్లు ఆసుపత్రిలో కార్మికురాలిని పరామర్శించిన సీఐటీయూ నాయకులు

ఉరవకొండ, జూలై 4 ప్రభాతవార్త



అపస్మారక స్థితిలో పడివున్న మధ్యాన్న భోజన కార్మికురాలు సుంకమ్మ



ఆసుపత్రిలో కార్మికురాలిని పరామర్శిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ఉపాధ్యక్షురాలు జయ రమాదేవి, ఎండీఎం జిల్లా అధ్యక్షులు జయమ్మ, ఉపాధ్యక్షులు రంగమ్మ తదితరులు

ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు మండల పరిధిలోని ఛాయాపురం గ్రామంలోగల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని వంటగది వద్దే మధ్యాన్న భోజన పథకం కార్మికురాలు సుంకమ్మ పురుగుల మందుతాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడటం గురువారం కలకలం రేపింది. అపస్మారక స్థితిలో పడివున్న ఆమెను స్థానికులు కొందరు హుటాహుటిన గుంతకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతోంది. విషయం తెలియగానే సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు యం.నాగమణి, ఉపాధ్యక్షులు జయ రమాదేవి, ఎండీఎం జిల్లా అధ్యక్షులు జయమ్మ, ఉపాధ్యక్షులు రంగమ్మ, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.రంగారెడ్డి, సీపీఎం పార్టీ వజ్రకరూరు మండల అధ్యక్షుడు విరుపాక్షి మధ్యాన్న భోజన పథకం కార్మికులు తదితరులు ఆసుపత్రికి చేరుకొని సుంకమ్మను పరామర్శించి వైద్యులతో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాన్న భోజన పథకం ప్రారంభించిన 2003 నుండి సుంకమ్మ అనే కార్మికురాలు ఎంపీపీ పాఠశాలలో కార్మికురాలిగా పనిచేస్తోందని నెలలకొద్ది బిల్లులు పెండింగ్‌లో ఉన్నా, అతి తక్కువ వేతనం ఇస్తున్నా దాదాపు 22 సంవత్సరాలుగా ఆరోపణలకు తావులేకుండా పిల్లలకు భోజనం వండి పెడుతోందన్నారు. ఈక్రమంలోనే గురువారం ఉదయం అధికార టీడీపీ నాయకులు 30 మంది పాఠశాలలో వంట చేస్తున్న సుంకమ్మను భోజన పథకం నిర్వహణ బాధ్యతను వదులుకోవాలని బెదిరిస్తూ మూకుమ్మడిగా దాడిచేసి కొట్టి బయటకు ఈడ్చిపడేసి పాత్రలు సైతం విసిరి పడేశారన్నారు. దీంతో అవమానాన్ని భరించలేక సుంకమ్మ పురుగుల మందుతాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిందన్నారు. ఆమె చనిపోతుందేమోనని అరుస్తున్న పిల్లలను కూడా కొట్టారని హెడ్ మాస్టర్ మాత్రం ప్రేక్షకపాత్ర వహించాడన్నారు. ఆమె చావుబ్రతుకుల మధ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతోందన్నారు. సుంకమ్మపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని ఇంత జరుగుతున్నా పట్టించుకోని హెడ్ మాస్టర్‌ను సస్పెండ్ చేయాలన్నారు. సుంకమ్మకు మెరుగైన వైద్యం అందించి ఆమెను మధ్యాన్న భోజనం నిర్వహణ బాధ్యతల్లో కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.

# కేంద్రం నీట్ పరీక్షను రద్దు చేయాల్సిందే..!

- ఉరవకొండలో విద్యా సంస్థల బంద్ విజయవంతం

ఉరవకొండ, జూలై 4 ప్రభాతవార్త



ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు నినాదాలు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

అక్రమాలు జరిగిన నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు గురువారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ ఉరవకొండలో విజయవంతమైంది. ప్రైవేటు విద్యాసంస్థలను వాటి యాజమాన్యాలు స్వచ్ఛందంగా మూసివేయగా ప్రభుత్వ విద్యాసంస్థలవద్దకు వెళ్లిన విద్యార్థి సంఘాల నాయకులు బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధార్థ, ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు హరూన్‌రషీద్, యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బ్రహ్మా, సిసింద్రీ, పీఎస్‌యూ జిల్లా కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ నేషనల్ ఎలిజిబిలిటి కమ్ ఎంట్రన్స్ టెస్ట్ దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సులు చదవాలనుకునే 24 లక్షల మంది విద్యార్థులు మే 5న ప్రవేశ పరీక్ష రాశారని అయితే ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సక్రమంగా నిర్వహించకపోవడంవల్ల ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. మార్కుల్లో అవకతవకలు, ఫలితాల్లో అక్రమాలు జరుగగా 67 మంది విద్యార్థులకు ఫస్ట్ ర్యాంకు రావడం వారిలో ఎనిమిది మంది ఒకే కేంద్రంవారు కావడం విశేషమన్నారు. జూన్ 14న పరీక్షా ఫలితాలు విడుదల చేయాల్సి ఉండగా హఠాత్తుగా సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు 4న విడుదల చేసి అక్రమాలను కప్పి పెట్టాలని ఆలోచించారన్నారు. నీట్ పరీక్షలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని, లీకులకు కారణమైన ఎన్టీఏ సంస్థను రద్దు చేయాలని, అక్రమాలను నిగ్గుతేల్చి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలో అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ ఎన్డీఏ ప్రభుత్వం రాజీనామా చేయాలన్నారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు హిరణ్య, నందు, ఏఐఎస్ఎఫ్ నాయకులు అనీల్, ఆకాష్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ ఇంచార్జ్ వై.మధుసూదన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

- నియోజకవర్గ వ్యాప్తంగా కేక్‌లు కట్‌చేసిన కాంగ్రెస్ నాయకులు, అభిమానులు



వై.మధుసూదన్‌రెడ్డిను షాలువాకప్పి పూలమాలతో సన్మానిస్తున్న దృశ్యం

ఉరవకొండ, జూలై 4 ప్రభాతవార్త

కాంగ్రెస్ పార్టీ ఉరవకొండ నియోజకవర్గ ఇంచార్జ్ వై.మధుసూదన్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉరవకొండ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంకు వెళ్లి వై.మధుసూదన్‌రెడ్డికు పుష్పగుచ్ఛాలు అందించి షాలువాలుకప్పి పూలమాలలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన చేత కేక్‌లు కట్ చేయించి మిఠాయిలు పంచి పెట్టారు. తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నైలో తాగమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద పిల్లలు 100 మందికి భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, అభిమానులు మాట్లాడుతూ పిలిస్తే పలికే నాయకుడు, కార్యకర్తలకు ఏ కష్టమొచ్చిన నేనున్నాని భరోసా ఇచ్చే ప్రియతమ నేత వై.మధుసూదన్‌రెడ్డి నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఎన్నో ఉన్నత పదవులను అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వై.మధుసూదన్‌రెడ్డి అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

# గుత్తిలో విద్యాసంస్థలు బంద్



విద్యార్థి సంఘాలు బంద్ నిర్వహిస్తున్నదృశ్యం

గుత్తి, జూలై 4 ప్రభాతవార్త

నీట్ పరీక్ష రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థలను బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల నుండి కళాశాలల వరకు కలియతిరుగుతూ విద్యాసంస్థలను బంద్ చేయించారు. పరీక్షా పత్రాలు లీకేజికి నైతికబాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రదాన్ రాజీనామా చేయాలని సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం గాంధీచౌక్ వద్ద రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు వెంకటేష్‌నాయక్, నాయకులు బాలాజీ, కృష్ణ, ఈశ్వర్, గురు, వినయ్, ధన, తదితరులు పాల్గొన్నారు.

# గుత్తికోటలో సినిమా షూటింగ్ చిత్రీకరణ



గుత్తికోట వద్ద చిత్ర యూనిట్ హడావుడి దృశ్యం

గుత్తి, జూలై 4 ప్రభాతవార్త

చారిత్రక నేపథ్యం కలిగిన గుత్తికోటలో గురువారం ద్విభాషా చిత్రం సినిమా షూటింగ్ చిత్రీకరణ జరిగింది. తెలుగు, తమిళం భాషల్లో రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ 20 రోజులుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో షూటింగ్ నిర్వహించినట్లు సినిమా దర్శకులు వినోద్ తెలిపారు. సినిమా షూటింగ్ జరుగుతుండడంతో ప్రజలు పెద్దఎత్తున కోట ప్రాంతానికి తరలివచ్చారు. సినిమా చిత్రీకరణ కోసం కోటలోని లొకేషన్లు బాగున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కో డైరెక్టర్ కార్తీక్, అసోసియేట్ డైరెక్టర్ అభిషేక్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, నటీనటులు, యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా వంగవీటి జయంతి వేడుకలు



బలిజనేతలు కేక్ కట్ చేస్తున్న దృశ్యం

గుత్తి, జూలై 4 ప్రభాతవార్త

గుత్తి పట్టణంలో గురువారం బలిజ సంఘం ఆధ్వర్యంలో కాపునేత వంగవీటి మోహన్‌రంగా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు బండి సత్య, కప్పట్రాళ్ల సురేష్, హేమలత, నాగయ్య, పులికొండ, రవి, హరి, తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ వాహనాన్ని తనిఖీ చేసిన డిఎస్ఓ



రేషన్ బండిని తనిఖీ చేస్తున్న దృశ్యం

గుత్తి, జూలై 4 ప్రభాతవార్త

పట్టణంలో ఇంటింటా జరుగుతున్న రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని గురువారం జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి శోభారాణి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనంలో నిత్యావసరవస్తువుల తూకాలను పరిశీలించారు. లబ్దిదారులు ప్రతి ఒక్కరికి రేషన్ అందించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి సూర్యనారాయణ, ప్రశాంత్, విఆర్ఎ బాలు, తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీకు వడ్ల సలీమ్ రాజీనామా

-తాను వ్యక్తిగతంగా ఎవరినీ విమర్శించలేదని వివరణ

ఉరవకొండ, జూలై 5 ప్రభాతవార్త



వడ్ల సలీమ్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకు, యువజన విభాగం జిల్లా కార్యదర్శి బాధ్యతలకు పట్టణానికి చెందిన వడ్ల సలీం రాజీనామా చేశారు. ఈ విషయాన్ని గురువారం పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రటకన ద్వారా తెలియజేశారు. ఇకపై తనకు వైఎస్సార్‌సీపీకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తాను ఎవరినీ వ్యక్తిగతంగా విమర్శించలేదని తన పేరు వాడుకొని ఎవరూ రాజకీయ రాద్ధాంతం చేయవద్దని కోరారు.

# రైతు బిడ్డలకు ప్రతి గ్రామంలోనూ సాయంకాలపు ఉచిత ట్యూషన్

- జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేష్

ఉరవకొండ, జూలై 4 ప్రభాతవార్త



జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేష్

ఉరవకొండ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ రైతుల బిడ్డలకోసం సాయంకాలపు ట్యూషన్స్ (ఆస్క్) ప్రారంభించబోతున్నామని జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేష్ తెలిపారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యంగా రైతు బిడ్డలకు చదువు, సంస్కారం, నైతిక విలువలు నేర్పించడం కోసం అభయ ఫౌండేషన్ సహకారంతో ట్యూషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతిరోజూ ఉన్న ఊరిలోనే ట్యూషన్స్ చెప్పటానికి ఉపాధ్యాయులు కావలెనని, కనీసం డిగ్రీ చదివి ఉండాలని, గౌరవ వేతనం ఇవ్వబడుతుందన్నారు. సేవా తత్పరత, దేశభక్తి భావాలు ఉన్నవాళ్లకి అధిక ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. 10వ తేదీలోగా ఉపాధ్యాయులు ఎంపిక జరుగుతుందని ఆసక్తిగలవారు మొబైల్ నంబర్లు 80747 80746, 62813 97630లకు ఫోన్ చేయాలని కోరారు.

# భారతరత్న గుల్జారీలాల్ నందా సేవలు చిరస్మరణీయం

- మన్యం వీరుడు అల్లూరి ఉద్యమాలకు స్ఫూర్తి ప్రధాత
- ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ల, బిస్కెట్ల పంపిణీ



ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉరవకొండ, జూలై 4 ప్రభాతవార్త

దేశానికి రెండు పర్యాయాలు ప్రధాన మంత్రిగా పనిచేసిన అనుభవశాలి, భారతరత్న గుల్జారీలాల్ నందా, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, ఆధ్యాత్మికవేత్త స్వామి వివేకానంద, దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య, వంగవీటి మోహనరంగ చిరస్మరణీయులని విద్యావేత్త డి.ఎర్రిస్వామి పేర్కొన్నారు. నందా, అల్లూరి, రంగ, రోశయ్య జయంతి, వివేకానంద వర్ధంతిలను పురస్కరించుకొని గురువారం విజయ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు, విఠల్ రుక్మిణీ విజయ వృద్ధ అనాథాశ్రమం నిర్వాహకులు, విద్యావేత్త డి.ఎ ర్రిస్వామి ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యావేత్త డి.ఎర్రిస్వామి మాట్లాడుతూ గుల్జారీలాల్ నంద తొలిసారి జవహర్‌లాల్ నెహ్రూ మరణానంతరం, రెండవసారి లాల్‌బహుదూర్‌శాస్త్రి మరణానంతరం దేశ ప్రధాని బాధ్యతలు నిర్వహించారన్నారు. 1997లో ఆయనకు భారత రత్న పురస్కారం లభించిందని కొనియాడారు. బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి స్వాతంత్ర్యోద్యమంలో ప్రాణాలను లెక్క చేయకుండా పోరాడి బ్రిటీష్ పాలకుల చేతిలో దేశం అమరుడయ్యారని ఆయన పోరటతత్వం నేటి యువతకు స్ఫూర్తి దాయకమని కొనియాడారు. జాతిని మేలుకొలిపిన ఆధ్యాత్మిక వేత్త స్వామి వివేకానంద, క్రిందిస్థాయి నుంచి ఎదిగి రాష్ట్ర ముఖ్యమంత్రి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన కొణిజేటి రోశయ్య, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడిన వంగవీటి మోహనరంగ స్ఫూర్తి ప్రధాతలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ గంగాధర్, డాక్టర్ అర్జున్, విజయ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బజ్జలయ్య, విఠల్ రుక్మిణీ ఆశ్రమ సహాయకులు రాంబాబు, సోమశేఖర్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిభిరమును ప్రజలు సద్వినియోగం చేసుకోండి




కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్, జులై 4 ప్రభాతవార్త

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో ఈ నెల 14వ తేది ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిభిరమును నిర్వహిస్తున్నామని పట్టణ, గ్రామీణ ప్రాంత పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షులు జయసింహ, కార్యదర్శి నాగభూషణ, కోశాధికారి సుదర్శన్ గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా వారు సాంస్కృతిక మండలిలో శిబిరం యొక్క కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిభిరం రోటరీ క్లబ్ ధర్మవరం, శంకర కంటి ఆసుపత్రి జిల్లా అంధత్వ నివారణ సంస్థ శ్రీ సత్యసాయి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరానికి దాతలుగా కీ.కలవల సుకన్య జ్ఞాపకార్థం భర్త కలవల మురళీధర్, సుకన్య సిల్క్స్ వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక మండలి వ్యవస్థాపకులు సత్రశాల ప్రసన్నకుమార్, నేషనల్ పల్స్ పోలియో చైర్మన్, రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా చైర్మన్ రత్నశేఖర్‌రెడ్డి, రమేష్‌బాబు, శివయ్య, శ్రీనివాసరెడ్డి, బండారు వెంకటాచలం, పెరుమాళ్ల దాస్ తదితరులు పాల్గొన్నారు.

# తిప్పేస్వామి సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్న 2వ వార్డు సుధాకర్‌నాయక్



మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో టిడిపిలో చేరుతున్న సుధాకర్‌నాయక్

మడకశిర టౌన్, జులై 4 ప్రభాతవార్త

మడకశిర పట్టణంలో గురువారం ఉదయం బాలాజీ నగర్‌లో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 2వ వార్డు కౌన్సిలర్ సుధాకర్‌నాయక్ వైసీపీ పార్టీకి రాజీనామా చేసి రాష్ట్ర తేదేపా ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, కౌన్సిలర్ సుధాకర్‌కు టిడిపి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మనోహర్, కౌన్సిలర్లు నరసింహరాజు, వైస్ చైర్మన్ వెంకట లక్ష్మమ్మ, హనుమంతు, ఉమాశంకర్, శ్రీనివాసులు, శీనప్ప, మేఘన రమేష్, మాజీ కౌన్సిలర్ కృష్ణనాయక్, అంజమ్మ, మ ఆజీ వైస్ చైర్మన్ నాగరాజు, తెలుగు యువత నాయకుడు తిమ్మరాజు, బేగర్లపల్లి రవి డీలర్ పాల్గొన్నారు.

# ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు

ధర్మవరం రూరల్, జులై 4 ప్రభాతవార్త



అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 126వ జయంతి వేడుకలు పాఠకుల నడుమ గ్రంథాలయ అధికారి సౌభాగ్యవతి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అంజలి సౌభాగ్యవతి మాట్లాడుతూ.. తెల్ల దొరల కబంధ హస్తాల నుంచి చిక్కుకున్న దేశానికి స్వాతంత్ర్యం తెప్పించుటలో ఆయనకు ఆయనే సాటి అని తెలిపారు. అల్లూరి తన ప్రాణమును తెగించి తెలుగు జాతి బిడ్డ, మన్యం వీరుడు అని వారు కొనియాడారు. నేడు అల్లూరి సీతారామరాజును స్మరించుకోవడం మనందరి బాధ్యత అని వారు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనుల హక్కుల కోసం ఉద్యమించడమే కాకుండా ఆయన దేశం కోసం ప్రాణ త్యాగం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సత్యనారాయణ, శివమ్మ, గంగాధర్, రమణనాయక్, అధిక సంఖ్యలో పాఠకులు పాల్గొన్నారు.

# మహిళా శక్తి సొసైటీ అధ్యక్షురాలు సుబ్బమ్మ ఆధ్వర్యంలో లీగల్ క్యాంప్

రామగిరి, జులై 4 ప్రభాతవార్త

మండలంలోని పేరూరుగ్రామంలో మహిళా శక్తి సొసైటీ అధ్యక్షురాలు సుబ్బమ్మ ఆధ్వర్యంలో లీగల్‌క్యాంప్ నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో ముఖ్యంగా సొసైటీ పాలక వర్గం, సిబ్బంది సమాజంలో బాల్య వివాహాలు, మద్యపానం వలన కుటుంబంలో ఎలాంటి సమస్యలు వస్తాయి అనే విషయాలపై నాటిక రూపంలో ప్రదర్శించడం జరిగింది. అలాగే సొసైటీ కార్యనిర్వహణాధికారి బి.కాంచన సమాజంలో మహిళల యొక్క పాత్ర గురించి క్లుప్తంగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టింబక్టు కలెక్టివ్ నుంచి గౌరీ, రవళి, పావని, ముఖ్య అతిథులుగా హాజరు కావడం జరిగింది.

# జిల్లా వైద్యాధికారిని హామీతో ఆశాల సమ్మె విరమణ.



జిల్లా వైద్యా కార్యాలయం వద్ద చేస్తున్న ఆశా వర్కర్లు.

పుట్టపర్తి రూరల్ జులై 04 ప్రభాతవార్త

గోరంట్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేస్తున్న ఆశా వర్కర్ శబరి ఆత్మహత్యయత్నానికి కారణమైన ఎమ్మల్‌హెచ్‌పి గౌతమి పై చర్యలు తీసుకోవాలని ఆశ వర్కర్లు గత రెండు నెలల నుండి పలువురు అధికారులకు విన్నవించిన ఫలితం లేకపోవడంతో గురువారం నుండి ఆశ వర్కర్లు సమ్మెకు నోటీసులు అందించారు. శ్రీసత్యసాయి జిల్లా వైద్యాధికారిని మంజువాణి ఆశా వర్కర్లను పిలిపించి మీ సమస్యలను పరిష్కారిస్తామని దానికి కొంత సమయం కేటాయించాలని కోరగా ఆమె కోరిక మేరకు ఆశ వర్కర్లు సమ్మెను విరమించుకున్నట్లు ఆశా వర్కర్లు గౌరవాధ్యక్షుడు సాంబశివ సిఐటియు జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ తెలిపారు. గురువారం సత్యసాయి జిల్లా వైద్యధికారి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించాలని వెళ్లిన ఆశ వర్కర్లను జిల్లా వైద్యాధికారులు సంప్రదింపులు జరిపి మీ సమస్యలను రీజనల్ డైరెక్టర్ నుండి సమాచారం మేరకు చర్యలు చేపడతామని ఆశాలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు అభిస్టానంమేర గతంలో ప్రతి నాలుగవ శనివారం ఆశాలు సిఐటియు నాయకులు వైద్యాధికారులతో ఆశాల సమస్యలపై జాయింట్ యాక్షన్ కమీటి సమావేశం నిర్వహించే వారమని దానిని యధామిదిగా కొనసాగించాలని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి ఆమె స్పందించి గతంలో మాదిరిగే నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. అందుచేత ధర్నా చేయాలని వెళ్లిన ఆశాలు ఆమె హామీతో వెనుతిరిగారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లు జిల్లా ప్రధాన కార్యదర్శి సౌభాగ్య, జిల్లా సహాయ కార్యదర్శి లేపాక్షి ప్రధాన కార్యదర్శి, ముంజుల ముంతాజ్ చెన్నకృష్ణమ్మ, భాగ్యమ్మ మండలలోని 40 మంది ఆశా వర్కర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 117 వ జీవో రద్దుచేసి పాఠశాలను బలోపేతం చేయాలి-ఎస్‌టియు



117 జివొ ప్రతులను చూపుతున్న ఉపాధ్యాయులు,

పుట్టపర్తి రూరల్ జులై 04 ప్రభాతవార్త

ప్రభుత్వ పాఠశాల మనుగడకు ప్రశ్నార్థకంగా ఉన్న జివో 117 రద్దు చేసి పాఠశాలలో విలీనం ఆపాలని ఎస్టీయూ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం పుట్టపర్తి మండలంలోని జగరాజుపల్లి, బీడుపల్లి, పెడపల్లి, నడిమామిడి, ప్రశాంతిగ్రామమ్ పాఠశాలలో సభ్యత్వాన్ని ప్రారంభిస్తూ పాఠశాలలోని వివిధ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళుతున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం యాప్‌ల భారాన్ని తగ్గించాలని సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ పునరుద్ధరించాలని ప్రమోషన్‌ను బదిలీలు వెంటనే చేపట్టాలని 2003డిఎస్సి ఉపాధ్యాయులకు ఓపిఎస్‌ను అమలు చేయాలని అవసరమున్న చోట ఉపాధ్యాయులకు కేటాయించి సర్దుబాటు చేయాలని పాఠశాల గ్రాంటులు సమయానికి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి సంపత్‌కుమార్, వెంగమనాయుడు, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు జిల్లా కౌన్సిలర్ వెంకట్రావు నాయక్, నాగేంద్ర, చిన్ననాయక్, ఉపాధ్యాయులు ఈశ్వర్‌రెడ్డి హెచ్‌ఎం వెంకట్‌నాయుడు, స్వర్ణలత, ఉమాదేవి, గిరిస్వామి, వెంకట్‌నాయుడు, బాబు, హరి, తదితరులు పాల్గొన్నారు.

# విదేశి విద్యపథకం పునఃప్రారంభించడంతో హిందుపూర్ టు అమరావతి స్కూటీ యాత్ర



మక్బూల్ ఖాన్‌ను సత్కరిస్తున్న మైనారిటీ నాయకులు,

గోరంట్ల జులై 04 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అంబేత్కర్ విదేశి విద్యాపథకాన్ని పునఃప్రారంభించడంతో ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు మరియు డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌కు స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు విదేశి విద్య ప్రధాతలకు ధన్యవాదాలు స్కూటీ యాత్రలో భాగంగా హిందుపురం నుండి అమరావతికి హిందుపురం పట్టణానికి చెందిన మగ్బుల్ జాన్ గురువారం ఉదయం స్కూటీ యాత్రను ప్రారంభించారు. అయితే యాత్రలో భాగంగా గోరంట్ల మీదుగా ఆమె వెళ్తున్న సందర్భంగా గోరంట్ల మైనారిటీ నాయకులు ఆమెను మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ అధికారం లోకి ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అంబేత్కర్ విదేశి విద్య స్కాలర్ షిప్ పథకాన్ని పునఃప్రారంభించడం జరిగిందన్నిరు. దీంతో విదేశి విద్యాప్రధాతకు ధన్యవాద స్కూటీ యాత్రను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా గోరంట్ల పట్టణంలోని చంద్రశేఖర్ థియేటర్ నందు ఆమెకు టిడిపి మైనారిటీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు కార్యదర్శి అజంతుల్లా, మల్లాపల్లి, ఫిరోజ్ భాషా, షారూక్ షర్, ఫుద్దీన్ సాదిక్, షామీర్, సుబ్బరాయుడు, అన్నపూర్ణ హోటల్ ఆదినారాయణ మహబూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.




## మైసూరులో మాభూములు సేకరించి బదిలీ నివేశనాలు ఇచ్చింది బిజెపి సర్కారు : సిద్దరామయ్య.




బెంగళూరు విధానసౌధ వద్ద మీడియాతో సిఎం మాట్లాడుతున్న దృశ్యం.

బెంగళూరు,జూలై4,ప్రభాతవార్త ప్రతినిధి

మైసూరులో ముడా పంపిణీ చేసిన నివేశనాల వివాదాన్ని రాజకీయ లాభంకోసం బిజెపి ఉపయోగించిందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆరోపించారు.ఆయన గురువారం విధానసౌధలో కెబినెట్ సమావేశం ముగిసిన తరువాత ఇంటికివెళుతూ మీడియాతో మాట్లాడారు.గత బిజెపి సర్కారు హయాంలో మైసూరు అభివృద్ది ప్రాధికార మాకు చెందిన 3ఎకరాల16కుంటల జమీను అక్రమంగా స్వాదీనం చేసుకుని దానికి బదులుగా 50,50నిష్పత్తిలో వేరేచోట నివేశనాలు ఇచ్చిందని స్పష్టీకరించారు.మానుంచి మూడా సేకరించిన భూముల విలువ ఇప్పుడు 60కోట్లుగా ఉందని చెప్పారు.మేము అంతసొమ్ము డిమాండ్ చేయటంలేదు. మూడా కేటాయించిన నివేశనాల్లో అక్రమాలు జరిగాయాని వాసన రావటంతో సదరు నివేశనాల పంపిణి నిలుపుదల చేసినట్లు సిఎం చెప్పారు.నేను కానీ నా శ్రీమతి కానీ నా కుటుంబం కానీ ముడా భూముల విషయంలో అక్రమాలు జరపలేదని సిఎం స్పష్టం చేశారు.మైసూరు రింగ్‌రోడ్డు నిర్మాణంలో కెసరె గ్రామం వద్ద ఉన్న మా 3.16ఎకరాల భూమిని ముడా అక్రమంగా స్వాధీనం చేసుకుని రోడ్డు నిర్మించింది.దీని గురించి న్యాయం చేయాలని అడిగితే ముడా తప్పుచేసినట్లు అంగీకరించి సదరు పొలానికి బదులుగా వేరేచోట 50శాతం నిష్పత్తిలో కొత్తభూములు కేటాయించింది.దీంట్లో నేనే ఎలా అక్రమాలు చేశానని సిద్దరామయ్య ప్రశ్నించారు.బిజెపి నాయకులు మైసూరు ఆర్ఎస్ఎస్ నాయకులు మద్దతుతో నాపై అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారు.ముడా అక్రమాల గురించి దర్యాప్తు జరుగుతోంది. తప్పు ఎవరు చేసినా శిక్ష పడాల్సిందే అని సిఎం చెప్పారు.బిజెపి వారికి నాపై ఆరోపణలు చేసేందుకు సరుకు ఏమీ దొరకలేదు. ముడా అక్రమాలంటూ రాజకీయ లాభం కోసం తాము కేటాయించిన భూముల విషయాన్ని వల్లించి అభాసుపాలు అవుతున్నారని చెప్పారు.సిఎం వెంట మంత్రులు డాక్టర్ హె చ్‌సి.మహదేవప్ప, దినేష్ గుండూరావు,ఎన్ఎస్.బోసురాజు తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటకలో కాంగ్రెస్ సర్కారు అస్థిరత్వం

### -ఎన్నాళ్లు పాలనలో ఉంటుందో తెలియదు విజయేంద్ర




బిజెపి పదాధికారుల సభలో విజయేంద్ర

బెంగళూరు,జూలై4,ప్రభాతవార్త ప్రతినిధి

కర్ణాటకలో కాంగ్రెస్ సర్కారు పతనం అంచులకు చేరుకుందని ఈసర్కారు పతనానికి రోజులు లెక్కపెట్టుకుంటుందని బిజెపి అధ్యక్షుడు బివై.విజయేంద్ర చెప్పారు.ఆయన గురువారం స్థానిక ప్యాలెస్ మైదానంలో జరిగిన బిజెపి రాష్ట్రస్థాయి పదాధికారుల ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు.కాంగ్రెస్ సర్కారు అస్థిరం పాలయ్యింది. ఆపార్టీలో అంతరంగిక కలహాలు పెద్దస్థాయిలో జరుగుతున్నాయి.సిఎం సీటు కోసం ఉపముఖ్యమంత్రుల నియామకం కోసం చాలా పెద్ద ఫైటు నడుస్తోంది.వీటిని సమర్ధమంతంగా ఎదిరించటంలో సిఎం విఫలం అయ్యారు.ఒక వంక అన్నిటిపైన పన్నులు పెంచిన సర్కారు మరోవంక సర్కారు జీతాలకు నిధులు చాలని స్థితిలో పడిపోయిందని ఆరోపించారు.సర్కారు అనుసరిస్తున్న ద్వంద్వ విధానాల వలన ప్రజలు ఈ సర్కారుకు దూరం అవుతున్నారని చెప్పారు. వాల్మీకి ఎస్టీ కార్పొరేషన్ నిధుల అక్రమ తరలింపు కేసులో సిఎం పాత్ర ఉందని ఆరోపణలు వచ్చిన నేపథ్యం,మైసూరు ముడా నివేశనాల అక్రమ పంపిణీలో వేలకోట్ల అక్రమాలు సిఎం కుటుంబానికి అక్రమంగా సైట్లు పంచిన కేసులు ఇవన్నీ సిద్దరామయ్యను నైతికంగా దెబ్బతీశాయని ఆరోపించారు. ఈ ఆరోపణల నేపథ్యంలోనే ముఖ్యమంత్రి బదిలీ డిమాండ్ కాంగ్రెస్‌పార్టీ తెరపైకి వచ్చిందని చెప్పారు.సర్కారు అక్రమాల గురించి వచ్చే శాసనసభ సమావేశాల్లో బిజెపి సర్కారును నిలదీయనుందని చెప్పారు.త్వరలో జరిగే మూడు అసెంబ్లీ ఉప ఎన్నికలు,ఒక ఎంఎల్‌సి ఎన్నిక, జిల్లా పంచాయతీ తాలూకా పంచాయతీ ఎన్నికల్లో బిజెపి ను గెలిపించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు.ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే మిత్రపక్షాలు 19సీట్లలో గెలిచి 145 అసెంబ్లీ నియోజకవర్గాల్లో లీడు పొందాయని అంకెసంఖ్యలతో వివరించారు.బిజెపి పరిపాలన పట్ల ప్రజల్లో వ్యతిరేకత లేపేందుకు పాలక పక్షం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.సభలో ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక్,పలువురు ఎంఎల్ఎలు పాల్గొన్నారు.

## చామరాజనగరలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

చామరాజనగర,జూలై 4,ప్రభాతవార్త ప్రతినిధి

చామరాజనగర జిల్లా చామరాజనగర తాలూకాలోని బసరట్టి క్రాస్ వద్ద గురువారం ఉదయం కెఎస్ ఆర్టీసి బస్సు ఒక మోటారుసైకిలును ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు.పోలీసులు తెలిపిన వివరాల మేరకు బసరట్టి క్రాస్ వద్ద రోడ్డుపై ఎదురుగా వచ్చిన ఆర్టీసి బస్సు మోటారుసైకిల్‌ను ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో కిషోర్(25),మహేశ్(27) అనే యువకులు అక్కడికక్కడె మృతి చెందారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆర్టీసి బస్సు డ్రయివర్‌ను విచారణ జరిపారు.

## కర్ణాటకలో నూతన సంప్రదాయానికి తెరతీసిన ముఖ్యమంత్రి సిద్దరామయ్య

### - ప్రతీగురువారం ఎంఎల్ఎలతో భేటీ

బెంగళూరు,జూలై4,ప్రభాతవార్త ప్రతినిధి

లోక్‌సభ ఎన్నికల సమరం ముగిసిపోవటంతో రాష్ట్ర అభివృద్దిపట్ల దృష్టిని కేంద్రీకరించిన ముఖ్యమంత్రి సిద్దరామయ్య గురువారం నుంచి అన్ని పార్టీల శాసనసభ్యులను కలుసుకుని వారి సమస్యలకు పరిహారం అందించేందుకు ప్రయత్నాలు ఆరంభించారు.గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా పాలకపక్ష ఎంఎల్ఎలను తప్పించి వేరేవారిని పబ్లిక్‌గా కలుసుకున్న దాఖలాలు లేవు.కర్ణాటక అభివృద్దికి అందరి సహకారం తీసుకోవాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి సిద్దరామయ్య నియోజక వర్గాల వారుగా ఎంఎల్ఎను కలుసుకుని వారి సమస్యను అడిగి తెలుసుకోనున్నారు.బెంగళూరులో గురువారం సాయంత్రం శాసనసభ్యులను కలుసుకునేందుకు సమయం నిర్ణయించారు.ఇకమీదట సిఎం నగరంలో ఉన్న గురువారం రోజున తప్పకుండా ఎంఎల్ఎలను కలుసుకుని చర్చలు జరపనున్నారు.నియోజకవర్గాల అభివృద్ధి నిధుల పంపకం,పేదలకు ఇళ్ల కేటాయింపులు. పోడి భూముల కేసులు,శాంతిభద్రతల పరిస్థితి గురించి నియోజకవర్గాల వారుగా చర్చించి పరిష్కారం సూచించనున్నారు.ఈనెల 15నుంచి శాసనమండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి.ఈలోగా అన్ని పార్టీల ఎంఎల్ఎలను స్వయంగా కలుసుకుని వారి సమస్యలను అడిగితెలుసుకుని సాయం ఇవ్వనున్నారు.

## బిఎంటిసికి 840కొత్త బస్సులు కొనుగోలుకు కెబినెట్ తీర్మానం

బెంగళూరు,జూలై 4,ప్రభాతవార్తప్రతినిధి



న్యాయశాఖ మంత్రి హెచ్‌కె.పాటిల్.

బెంగళూరు నగరంలో ప్రయాణీకులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు బిఎంటిసి కొత్తగా 840బస్సులను 363కోట్లతో కొనుగోలు చేసేందుకు కర్ణాటక మంత్రివర్గం గురువారం అనుమతి ఇచ్చింది.బెంగళూరులో ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం చేసిన తీర్మానాలను న్యాయ శాఖ మంత్రి హెచ్‌కె.పాటిల్ విలేకరులకు తెలియజేశారు. బిఎస్6 స్టాండర్ట్ కలిగిన కొత్త బస్సులు కొనుగోలుకు కెబినెట్ అనుమతినిచ్చింది.కర్ణాటకలోని పది మహానగరపాలికె (సిటి కార్పొరేషన్లు)ల్లో 2వేలకోట్ల రూపాయాలతో మహాత్మ గాంధీ నగరవికాస యోజన పేరిట మౌలికసదుపాయాలను కల్పిం చేందుకు కెబినెట్ అనుమతినిచ్చింది.బెంగళూరులోను ఇతరచోట్ల పనిచేసే ఇందిరాక్యాంటీన్లకు వంటపాత్రలు ఇతర ఉపకరణాలు కొనుగోలుచేసేందుకు సర్కారు 84కోట్ల 56లక్షల రూపాయల నిధులు మంజూరుకు అనుమతి నిచ్చింది. కొప్పళ్ మెడికల్‌కాలేజీలో మిగిలిపోయిన నిర్మాణపనులను 59కోట్ల రూపాయలతో పూర్తి చేసేందుకు అనుమతినిచ్చారు.బెంగళూరు నగరంలోని ర్ణాటక ఎగ్జామ్ బోర్డు కట్టడాన్ని అప్‌గ్రేడ్ చేసేందుకు 30కోట్ల రూపాయల పనులకు సర్కారు అనుమతి ఇచ్చింది.గ్రామీణాభివృద్ది పంచాయతీరాజ్ శాఖ లో గ్రేడ్1 అధికారుల బదిలీలను కౌన్సిలింగ్ విధానంలో నిర్వహించేందుకు సర్కారు అనుమతినిచ్చింది.దక్షిణకన్నడజిల్లా బెళ్తంగడినగరంలో బ్రహ్మర్షి నారాయణగురు కట్టడం నిర్మించేందుకు సర్కారు 14సెంట్ల స్థలాన్ని మంజూరు చేసింది.

## హాసన్ జిల్లా ప్రబలిన డెంగ్యూజ్వరాలు వారంలో ముగ్గురు పిల్లలు మృతి

హాసన్,జూలై4,ప్రభాతవార్త ప్రతినిధి

హాసన్ జిల్లాలో కురుస్తున్న వర్షాల వలన ఈజిల్లాలో దోమలబెడద పెరిగి డెంగ్యూ జ్వరాలు ప్రబలుతున్నాయి. గురవారం హాసన్ తాలూకాలో 8సంవత్సరాలు ఉన్న బాలకి వర్షికా డెంగ్యూ జ్వరానికి బలైంది.ఆరోగ్య శాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు హాసన్‌లో బుధవారం కమలశ్రీ అనే బాలకి జూన్30న ధనశ్రీ అనే బాలకి మృతి చెందింది.జిల్లాలో నిరంతరం వానలు కురవటంతో చెత్త వ్యర్థపదార్థాల తొలగింపులో జాప్యం జరుగుతుందని అధికారులు చెప్పారు.జిల్లాలో ఇప్పటివరకు వివిధ తాలూకాల్లో 6204మందికి డెంగ్యూ జ్వర పరీక్షలు నిర్వహించగా 235మందికి పాజిటివ్ వచ్చింది.జ్వరాల నియంత్రణ ప్లేట్‌లెట్స్ అందుబాటులో ఉంచేందుకు ఆరోగ్య శాఖ చర్యలుతీసుకున్నాకూడా జ్వరాలు అదుపులోనికిరాలేదు.కాగా మైసూరు జిల్లాలోని హుణసూరు తాలూకా సముదాయ ఆరోగ్యఅధికారి ఒకరు గురువారం డెంగ్యూజ్వరం వలన మృతిచెందారు.నాగేంద్ర(38) అనే అధికారి డెంగ్యూకు బలయ్యారు.ఈజిల్లాలోను 580యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఇక్కడకూడా 4590కేసుల్లో డెంగ్యూ పరీక్షలు జరిపారు.ముంగారుకు ముందే వానలు జోరందుకోవటంతో పలు జిల్లాల్లో డెంగ్యూజ్వరాలు ప్రబలాయి.

## మైసూరుజిల్లాలో కబిని జలాశయం భర్తీకి కేవలం 4అడుగుల నీరు బాకీ

మైసూరు,జూలై4,ప్రభాతవార్త ప్రతినిధి

మైసూరు జిల్లా హెగ్గడదేవనకోట తాలూకా బీచనహళ్లి సమీపంలోని కబిని జలశయం జలకళ సంతరించుకుని రైతుల్లో ఆనందాన్ని నింపుతోంది.గురవాఉం నాటికి ఈ జలాశయం నీటి మట్టం 80అడుగులుకు చేరుకుంది.కావేరి పరివాహకప్రాంతం కేరళలోని వయనాడ్ ప్రాంతంలో జోరువానల వలన కబిని జలాశయానికి పెద్దఎత్తున వరద నీరు వచ్చిచేరుతోంది.ఈ జలాశయం గరిష్టనీటి మట్టం 84అడుగులు కాగా మరో రెండుమూడు రోజుల్లో జలాశయం నిండే అవకాశాలు ఉన్నాయని కబిని డ్యాం ఎఇఇ చెప్పారు.ఇవాళ డ్యాంలోనికి 17843క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.డ్యాంనుంచి 580క్యూసెక్కుల నీటిని నదీప్రాంతానికి విడుదల చేస్తునట్లు అధికారులు చెప్పారు.దక్షిణ కర్ణాటకలో వానలు జోరుగా కురిస్తే మొదట కబిని జలాశయం భర్తీ అవటం మామూలుగా ఉంది.నిరుడు రాష్ట్రంలో ఏర్పడిన కరువు వలన ఈ డ్యాంలో నీటిమట్టం డెడ్‌స్టోరేజ్‌కు చేరుకుంది.ఈసారి జూలై ప్రారంభంలోనే డ్యాం నిండిపోవటానికి కొద్ది అడుగులు బాకీ ఉండటంతో పైనుంచ వస్తున్న వరదనీటిని దిగువకు వదులుతున్నారు.ఈనీరు తమిళనాడుకు ప్రవహిస్తుంది.

## ఉత్తరకన్నడ జిల్లాలో డెంగ్యూజ్వరానికి యువకుడు బలి

ఉత్తరకన్నడ,జూలై4,ప్రభాతవార్త ప్రతినిధి

ఉత్తరకన్నడ జిల్లాలో గురువారం డెంగ్యూజ్వరాలకు ఒక యువకుడు మృతి చెందాడు.ఆరోగ్యశాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు జిల్లాలోని కారవార తాలూకా బావికెరె గ్రామానికి చెందిన హరేరామభట్(38) డెంగ్యూ జ్వరానికి బలయ్యాడు.ఇతడు గత వారం రోజులుగా డెంగ్యూజ్వరంతో బాధపడుతూ పొరుగుజిల్లా బెళగావిలో వైద్య చికిత్స పొందుతూ ఇవాళ ఉదయం మృతి చెందాడు.కారవార జిల్లాలో 119మంది డెంగ్యూజ్వర పీడితులు ఉన్నారని ఈజిల్లాలో 2875మందికి డెంగ్యూ పరీక్షలు జరపగా 119మందికి పాజిటివ్ వచ్చిందని ఆరోగ్యశాఖ అధికారులు చెప్పారు.

## బెంగళూరు హఠాత్‌సమ్మె జరిపిన ఆటోడ్రైవర్లు

### - ఆర్టీవో కార్యాలయం పికెటింగ్

బెంగళూరు,జూలై 4,ప్రభాతవార్త ప్రతినిధి

బెంగళూరులో ఆటోరిక్షాలకు ప్రమాదంగా తయరైన ర్యాపిడో బైక్‌ట్యాక్సీ సేవలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నగరంలోని పలు ఆటోరిక్షా సంఘాలు గురువారం మధ్యాహ్నం ఇక్కడి శాంతినగర్‌లోని ఆర్టీసిబస్సుల రోడ్డునుదిగ్భంధనంచేసి ఆర్టీవోకార్యాలయాన్ని ముట్టడించారు. బెంగళూరులో రవాణాశాఖ అధికారులు అక్రమంగా ర్యాపిడో బైక్‌ట్యాక్సీలకు అనువతి ఇవ్వటంతో ఆటోరిక్షాలను ఎక్కేప్రయాణీకులు నానాటికి తగ్గిపోతున్నారని ఆందోళనలో పాల్గొన్న పలువురు ఆటో డ్రయివర్లు ఆరోపించారు. ప్రభుత్వం ఏక పక్షంగా ర్యాపిడో సంస్థ బైక్ ట్యాక్సీలను అనుమతి ఇవ్వటంతో నగరంలో కొద్దిపాటి దూరానికి వందలాది రూపాయలను వసూలు చేస్తూ మాకు అన్యాయం చేశారని ఆరోపించారు.సర్కారు వెంటనే మా ఏడు డిమాండ్లను తీర్చకపోతే వచ్చే రోజుల్లో బెంగళూరునగరంలో ఆటోరిక్షాలు క్యాబ్‌ల సమ్మెచేసి బంద్ ఆచరిస్తామని చెప్పారు.ఆటోరిక్షా డ్రయివర్ల హఠాత్ ఆందోళన వలన డబుల్‌రోడ్డులో కిలీమీటర్ల వరకు వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది.

## జైలుపాలైన దర్శన్ గ్యాంగ్‌కు మరో 14రోజులు జైలువాసం విస్తరణ

బెంగళూరు,జూలై4,ప్రభాతవార్త ప్రతినిధి

రేణుకాస్వామి హత్యకేసులో అరెస్టు అయిన కన్నడసిన్మాహీరో దర్శన్ అతడి 20మంది అనుచరులకు మరో రెండువారాల పాటు న్యాయాంగ కస్టడి విస్తరిస్తూ బెంగళూరులోని 42వ ఎసిఎంఎం కోర్టు గురువారం ఆదేశాలు జారీచేసింది.ఇప్పటికే పరప్పనఅగ్రహార సెంట్రల్‌జైల్లో ఉన్న దర్శన్ మరియు అతడిఅనుచరులను ఇవాళ మధ్యాహ్నం విడియోకాన్ఫరెన్సింగ్ ద్వారా విచారణ జరిపిన న్యాయమూర్తి సదరు దర్శన్ అతడి అనుచరులకు ఈనెల 18వరకు జ్యూడిషియల్ కస్టడి విస్తరిస్తూ ఆదేశించారు.ఈ కేసును సర్కారు తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రసన్నకుమార్ వాదించారు.దర్శన్‌కు బెయిల్ ఇవ్వకూడదని మరింత కస్టడి విస్తరించాలని మనవి చేశారు.

## రామనగరజిల్లా మాగడి తాలూకాలో రైతుపై ఎలుగుబంటు దాడి

మాగడి(రామనగరజిల్లా ).జూలై4,ప్రభాతవార్త ప్రతినిధి

రామనగర జిల్లా మాగడి తాలూకా కెస్తూరు సమీపంలో గురువారం ఉదయం పొలంపనికి వెళుతున్న యువకుడిపైన ఎలుగుబంటు దాడిచేసి కరవటంతో యువకుడికి తీవ్రమైన గాయాలయ్యాయి.పోలీసులు తెలిపిన వివరాల మేరకు కెస్తూరు సమీపంలోని పొలంలో పనికి వెళుతున్నయువకుడు కిట్టప్పను పొదలమాటు నుంచి వచ్చిన ఎలుగుబంటు దాడిచేసింది.ఎలుగుబంటు దాడిలో యువకుడి చేతులకు కాళ్లకు గాయాలయ్యాయి.యువకుడు ఎలుగుబంటితో పెనుగులాడి కర్రతో ఎదిరించటంతో అది అక్కడ నుంచి పలాయనం అయ్యింది.తీవ్రంగా గాయపడిన యువకుడిని బెంగళూరు విక్టోరియా పెద్దాసుపత్రికి చేర్చారు.ఈ ప్రాంతంలో సుమారు వారంరోజులుగా ఎలుగుబంటు సంచరిస్తుందని అటవీ శాఖ అధికారులకు రైతులు సమాచారం అందించి హెచ్చరించినా అధికారులు పట్టించుకోలేదు.

## విద్యాసంస్థల బంద్ విజయవంతం

అమరాపురం, జూలై 4 ప్రభాతవార్త



వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

దేశవ్యాప్త సమ్మెలో భాగంగా అమరాపురం మండలంలో విద్యాసంస్థలు గురువారం బంద్ పాటించాయి. ఈ సమ్మెలో జిల్లా కమిటీ సభ్యులు భూషణ్, మహబూబ్‌ఖాన్‌లు పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు భూషణ్, సిఐటియు మండల కార్యదర్శి మాబుఖాన్ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందన్నారు. తీవ్రమైన అవకతవకలు వ్యత్యాసాలతో బాధ్యతారాహిత్యంతో పరీక్షలు నిర్వహించారని, నీట్ పరీక్షా పత్రం లీకేజి తెరవెనుక కుంభకోణం, నీట్, పిజి పరీక్షను 12 గంటల ముందు వాయిదా వేయడం, యూజిసి నెట్ పరీక్ష రద్దు చేయడం వంటివి విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. నీట్ స్కాంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని దేశవ్యాప్తంగా ఐక్య విద్యార్థి సంఘాల విద్యార్థి నాయకులు ఆందోళన చేస్తున్నారన్నారు. ఉన్నత విద్య మాత్రమే కాకుండా పాఠశాల విద్య పరిస్థితి దారుణంగా మారిందని బిజెపి పాలనలో విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో కోత, ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గడం జరిగిందన్నారు. ఈ మధ్య దేశంలో 61,885 పాఠశాలలను మూసివేశారని దేశంలో విద్య, ప్రజాస్వామ్యంపై దాడికి వ్యతిరేకంగా గురువారం విద్యాసంస్థలను బంద్ చేయడం జరిగిందన్నారు. నీట్ పరీక్షలో పాల్గొని నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమరాపురం మండల కమిటీ సభ్యులు శ్రీనాథ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## బెంగళూరు నగరంలో సేల్‌కాని 2200 బిడిఎ ప్లాట్లు

బెంగళూరు,జూలై4,ప్రభాతవార్త ప్రతినిధి

బెంగళూరు నగరంలో ప్రజలకు వసతి సౌకర్యాలు కల్పించేందుకు బెంగళూరు అభివృద్ధి ప్రాధికార వందలకోట్ల రూపాయలు పోసి వివిధ చోట్ల నిర్మించిన బిడిఎ ఫ్లాట్లను ప్రజలు ఎవరూ కొనుగోలు చేయకపోవటంతో బిడిఎ ఆర్థిక చిక్కుల్లో ఇరుక్కుపోయింది.బెంగళూరు తూర్పు ప్రాంతంలో చెల్లఘట్ట ప్రాంతంలో నిర్మించిన బిడిఎ కాంప్లెక్సులో వందలాది ప్లాట్లును కొనేనాథుడు కనిపించకపోవటంతో వీటిని ఎలా అమ్మకం పెట్టాలో తెలియక బిడిఎ అధికారులు సతమతం అవుతున్నారు.బెంగళూరు సిటీలో బిడిఎ నివేశనాలకు భారీ డిమాండ్ ఉంది. అయితే నగరానికి దూరంగా ఉన్న ఖాళీస్థలాల్లో అభివృద్ధి ప్రాధికార నిర్మించిన వసతిగృహాల కాంప్లెక్సులో దాదాపు 2200ప్లాట్లు ఖాళీగా ఉన్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.చెల్లఘట్ట ప్రాంతం లోతట్టు ఏరియాగా ఉండటం అక్కడ రోడ్డు కన్నెక్టివిటి పెద్దగా లేకపోవటం,నగరానికి దూరంగా ఉండటంతో ఉద్యోగులు కానీ మధ్యతరగతి ప్రజలు కానీ వీటిని కొనుగోలు చేసేందుకు ముందుకు రావటంలేదు.ఈ ప్రాంతంలో మౌలిక సదుపాయాల కొరత ఉండటంతో సర్కారు వీటిని ఎలా విక్రయించాలో తెలియక సతమతం అవుతుంది.బిడిఎ అధికారులు లంచాలకు అలవాటు పడి ఊరికి దూరా గా ఉన్న ఏరియాల్లో ఇళ్లను నిర్మించి చేతులు కాల్చుకుంది.బిడిఎ కు చెందిన ఖాళీ ప్లాట్ల గురించి గురువారం బిడిఎ అధ్యక్షుడు శాంతినగర ఎంఎల్ఏ ఎన్.ఏ.హ్యారిస్ స్వయంగా సర్వే మొదలుపెట్టడంతో పాత నిర్మాణాల భండారం బయట పడింది.బిడిఎ స్వాధీనం లో వేలకుపైగా ఖాళీ ఇళ్లు ఉన్నా కూడా కనీసం వీటికి సేల్ వేలాలు పిలిచినా పాపానికి సంస్థ పోలేదు.

## కెంకెరలో విజృంభించిన వాంతులు, విరేచనాలు

### -ఒకరు మృతి, మరికొందరికి తీవ్ర అస్వస్థత

అమరాపురం, జూలై 4 ప్రభాతవార్త





నాగభూషణం (ఫైల్‌ఫోటో), చికిత్స పొందుతున్న చిన్నారి

మండలంలోని హేమావతి గ్రామ పంచాయతీ కెంకెర గ్రామంలో వాంతులు, విరేచనాలు విజృంభించడంతో నాగభూషణ్ (28) అనే వ్యక్తి మృతి చెందడంతో పటు కొందరు అస్వస్థతకు గురైన ఆసుపత్రిలో చికిత్స పొందున్నట్లు గ్రామ ప్రజలు పేర్కొన్నారు. కెంకెర గ్రామంలోని ఎస్‌సి కాలనీలో వున్నట్లుండి వాంతులు, విరేచనాలు కావడంతో నాగభూషణ్, సాకమ్మ, రంగప్ప, వర్ణ, రంగస్వామి, నాగరాజు, లోకేష్‌లు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తక్షణం బుధవారం అర్ధరాత్రి 108 వాహనంలో మడకశిరకు తరలించారు. నాగభూషణ్, సాకమ్మల పరిస్థితి విషమంగా వుడడంతో మెరుగైన వైద్యం కోసం హిందూపురంకు రెఫర్ చేశారు. అక్కడ కూడా పరిస్థితి విషమంగా వుండడంతో నాగభూషణ్‌ను అనంతపురం జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సాకమ్మ తుంకూర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇద్దరు విద్యార్థులు కూడా వాంతులు విరేచనాలకు గురైనట్లు సమాచారం. ముఖ్యంగా ఎస్‌సి కాలనీలో డ్రైనేజి వ్యవస్థ లేని కారణంగా ఎక్కడికక్కడ నీరు నిల్వ ఉండడంతో తాగునీరు కొళాయిల వద్ద మురుగునీరు నిల్వ ఉండడంతో పాటు అపరిశుభ్రత కారణంగానే అనారోగ్యానికి కారణమని ప్రజలు తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

### గ్రామాన్ని సందర్శించిన వైద్యాధికారులు :

కెంకెర గ్రామంలో వాంతులు, విరేచనాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న హేమావతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ భార్గవ్, డాక్టర్ జయకుమార్ తమ సిబ్బందితో గ్రామాన్ని సందర్శించి ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి కాలనీని సందర్శించి ప్రజలకు వాంతులు, విరేచనాలు నివారణపై అవగాహన కల్పించడంతో పాటు పారిశుద్ధ్యంపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఈరన్న పాల్గొని తక్షణం ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వై.ప్రసన్న, స్వాతి, నాగరాజు, చంద్రశేఖర్, ఈరన్న, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## హిందూ ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం




బస్టాండ్ కూడలిలో రాహూల్ గాంధీ దిష్టిబొమ్మకు దగ్ధం చేస్తున్న నాయకులు.

గోరంట్ల జులై 04 ప్రభాతవార్త

పార్లమెంటులో హిందూ మతంపై ఎంపి రాహుల్ గాంధీ అనవసర వ్యాఖ్యలు చేశారని నిరసిస్తూ గోరంట్ల పట్టణంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను హిందూ ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో దగ్ధం చేశారు.పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద నుండి హిందువుల ద్రోహి రాహూల్ హిందువులకు క్షమాపణ చెప్పాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.బస్టాండ్ సర్కిల్‌కు వెళ్లి రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్దం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని హిందువులు ఐక్యత లేకపోవడం వల్లె ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని వెంటనే ఎంపి పదవి నుండి అతనిని తొలగించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మారెమ్మ దేవాలయం ఆలయ అర్చకులు దేవి,స్వామి బైసాని శ్రీనివాస్‌గుప్తా,బిజెపి నియోజకవర్గ నాయకులు బొట్లు శ్రీనివాలసులు,మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి,బోయ నరేష్‌బోయ లక్ష్మీనారాయణ.కళ్యాణ్‌కుమార్,మహిళా మండలి అధ్యక్షురాలు న్యాయవాది రమాపావని,ముద్దుకృష్ణ,హరికృష్ణ,మాజి బిజెపి నాయకులు మధుసూధన్‌రెడ్డి అన్నపూర్ణ హోటల్ ఆదినారాయణ.తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జ్ ఎంపిడిగా బాధ్యతలు చేపట్టిన భాస్కర్



ఇన్‌చార్జ్ ఎంపిడిఒను సన్మానిస్తున్న దృశ్యం

అమరాపురం, జూలై 4 ప్రభాతవార్త

అమరాపురం మండల ఇన్‌చార్జ్ ఎంపిడిఒగా ఎఇగా విధులు నిర్వహిస్తున్న భాస్కర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు రావడంతో ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు గ్రామ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో వుండి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. అనంతరం గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

